## క్లుప్తంగా

### ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



చంద్రమౌళీశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, పెద్ద సంఖ్యలో మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వపత్రాలతో అర్చన చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలను నిర్వహించారు.

### రాంకీ ఉద్యోగుల రక్తదానం



రక్తదానం చేస్తున్న రాంకీ ఉద్యోగులు

పరవాడ: రాంకీ ఫౌండేషన్ 19వ వార్షికోత్సవం సందర్భంగా విశాఖ ఫార్మాసిటీ సహకారంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఫార్మాసిటీ హబ్‌లో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రోటరీ క్లబ్ చైర్మన్ కె.శ్రీనివాసరావు ప్రారంభించి, మాట్లాడారు. దేశంలో అవసరమయ్యే మేరకు రక్తదాన కేంద్రాల్లో రక్తం లభించడం లేదన్నారు. ఉమ్మడి విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో గర్భిణులు ప్రసవ సమయంలో రక్తం అందక చాలా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్య అధిగమించాలంటే ప్రతి పౌరుడు ఏడాదికి మూడు సార్లు రక్తదానం చేయాలని సూచించారు. ఏటా రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్న రాంకీ ఫౌండేషన్ యాజమాన్యాన్ని అభినందించారు. ఈ శిబిరంలో 81 మంది రాంకీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, విశాఖ ఫార్మాసిటీ హెచ్‌ఆర్ హెడ్ ఆర్.భరత్‌కుమార్, రాంకీ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

### అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



గరుడసేవలో అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణపుష్పార్చన సేవ ఘనంగా నిర్వహించారు. 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ బేడామండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

**విశేషంగా గరుడసేవ**

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ విశేషంగా జరిగింది. ఆలయ బేడామండపంలో ఉదయం ఈ సేవను ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని వెండి గరుడవాహనంపై వేంజేపచేశారు. అష్టోత్తర శతనామావళి పూజ జరిపారు. విశేష హారతులిచ్చారు. పూజలో పాల్గొన్న భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

### పీజీఆర్‌ఎస్‌కు 11 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్‌ఎస్) కార్యక్రమానికి వివిధ సమస్యలపై 11 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె.హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి విచారణ చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వంతెనపై పాదచారులు రాకపోకలు సాగించే చోట ఉన్న మద్యం సీసాలు

**బీఆర్‌టీఎస్ కారిడార్‌లో రోడ్డు దాటేందుకు ప్రజలు ఇబ్బంది పడరాదన్న ఉద్దేశంతో ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్‌వోబీ)లు నిర్మించారు. అయితే అధికారులు అనాలోచిత నిర్ణయం కారణంగా అవసరమైన చోట కాకుండా.. పెద్దగా ప్రజల తాకిడి లేని చోట ఏర్పాటు చేశారు. దీంతో ఇవి మందుబాబులకు, ఆకతాయిలకు ఆవాసాలుగా మారాయి. ఇందుకు పెందుర్తి బీఆర్‌టీఎస్ కారిడార్‌లో చినముషిడివాడ, పెందుర్తి జూనియర్ కళాశాల, ఆర్‌ఆర్ వెంకటాపురం వద్ద ఉన్న ఎఫ్‌వోబీలే నిదర్శనం.**



పెందుర్తి జూనియర్ కళాశాల వద్ద బీఆర్‌టీఎస్ రహదారిపై నిర్మించిన ఫుట్ ఓవర్ వంతెన

# ఆకతాయిల ఆవాసాలు.. ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు!

- రాత్రిపూట ఓపెన్ బార్‌లుగా ఎఫ్‌వోబీలు
- చినముషిడివాడ ఎఫ్‌వోబీపై నిత్యం మందు పార్టీలు
- పట్టించుకోని అధికారులు, పోలీసులు



వంతెనపై పగులగొట్టిన మద్యం సీసాలు



చినముషిడివాడ ఎఫ్‌వోబీ మెట్లపై వదిలేసిన ఖాళీ మద్యం బాటిళ్లు

పెందుర్తి: ఫుట్ ఓవర్ బ్రిడ్జి(ఎఫ్‌వోబీ)లు మందుబాబులకు ఓపెన్ 'బార్'లుగా మారిపోయాయి. అధికారుల ఆలోచనారాహిత్యం రూ.కోట్ల ప్రజాధనాన్ని నిరుపయోగంగా మార్చాయి. పైపెచ్చు ప్రజలకు అక్కరకు రాకపోగా, ఆకతాయిల వికృత చేష్టలకు ఆవాసాలుగా మారాయి. ముఖ్యంగా చినముషిడివాడ కూడలి వద్ద రోజూ సాయంత్రం వేళ వంతెనకు పది మీటర్లతో దూరంలో ఉన్న మద్యం దుకాణం నుంచి సరకు తెచ్చుకుని ఈ వంతెనపై పార్టీలు చేసుకోవడం మందుబాబులకు రివాజుగా మారింది. పగటిపూట ప్రజలు రోడ్డు దాటేందుకు ఏమాత్రం ఉపయోగపడకుండా వెలవెలబోయే ఈ వంతెన చీకటి పడితే మాత్రం మద్యం సీసాల గలగలతో కళకళలాడుతుంది.

**గాయపడుతున్న వాహనదారులు**

మరోవైపు ఈ ఎఫ్‌వోబీలపై పూటుగా మద్యం సేవించిన ఆకతాయిలు ఖాళీ మద్యం సీసాలను దారిన పోతున్న వాహనదారులపై పడేస్తున్నారు. మరికొందరు అడుగు ముందుకేసి ఆ సీసాలను పగులగొట్టి బీఆర్‌టీఎస్ రహదారిపై పారేస్తున్నారు. దీంతో పలువురు వాహనదారులు, పాదచారులు గాయపడుతున్నారు. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారిపై ఇంత జరుగుతున్నా పోలీసులు గానీ, జీవీఎంసీ అధికారులు గానీ ఇటువైపు కన్నెత్తి చూడకపోవడం గమనార్హం.

**ప్రజలకు పనికిరావు కానీ..**

పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కళాశాల, చినముషిడివాడ, ఆర్‌ఆర్ వెంకటాపురం(కృష్ణానగర్) వద్ద ఒక్కొక్కటీ దాదాపు రూ.కోటి ఖర్చు పెట్టి ఎఫ్‌వోబీలు నిర్మించారు. పదేళ్ల క్రితమే వీటిని నిర్మించినా వీటిని వినియోగించిన సాధారణ ప్రజల్ని వేళ్లమీద లెక్కించొచ్చు. రోడ్డు దాటడం అర నిమిషం పని. వంతెన ఎక్కితే దాదాపు 50 మెట్లు.. రెండు మలుపులతో చాలా సమయం పడుతుందని ప్రజల భావన. దీంతో రూ.కోట్లు వెచ్చించి చేపట్టిన ఈ వంతెనలు పూర్తిగా నిరుపయోగంగా మారాయి. ఈ అవకాశాన్నే ఆకతాయలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎండైనా., వానైనా తగిన రక్షణ/నీడ ఉండడంతో మధ్యాహ్నం, సాయంత్రం పూట ప్రశాంతంగా వంతెనల పైకి వెళ్లి నాలుగు పెగ్‌లు వేస్తున్నారు. కాస్త పొద్దుపోతే ఇతర అసాంఘిక కార్యక్రమాలు కూడా ఆయా వంతెనలపై జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

> **ఆకతాయిలకు అడ్డుకట్ట వేస్తాం**
>
> 
>
> బీఆర్‌టీఎస్ రహదారిపై ఎఫ్‌వోబీలపై జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలు మా దృష్టికి వచ్చాయి. మద్యం సేవించేవారు వంతెనలు వినియోగించకుండా చూడాల్సి న బాధ్యత తీసుకోవాలని వంతెనల సమీపంలోని మద్యం దుకాణాల యజమానులకు చెప్పాం. అలాగే నిత్యం మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి సమయాల్లో మా సిబ్బందిని గస్తీ ఉంచుతున్నాం. బహిరంగ ప్రదేశాల్లో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలను అనుమతించబోం. వంతెనపై జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు ఖచ్చితంగా అడ్డుకట్ట వేస్తాం.
>
> – కె.వి.సతీష్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, పెందుర్తి

### ఎండీఎం కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



పాఠశాలలో ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

పరవాడ: మధ్యాహ్న భోజన పథకం(ఎండీఎం) కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని మండల ఎండీఎం కార్మిక సంఘం అధ్యక్షురాలు కె.ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు వాడచీపురుపల్లి జెడ్పీ హైస్కూల్లో ఐద్వా ఆధ్వర్యంలో ఎండీఎం కార్మికు లు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆదిలక్ష్మి మాట్లాడుతూ పాఠశాలలో 18 ఏళ్లుగా 8 మంది కార్మికులు వంట పని చేస్తున్నప్పటికీ వారిలో నలుగురికి మాత్రమే నెలకు రూ.3 వేలు చొప్పున వేతనం అందిస్తున్నారని పేర్కొన్నా రు. ఆ నలుగురికి వచ్చిన వేతనాన్ని 8 మంది పంచుకుంటున్నట్లు తెలిపారు. ఈ పరిస్థితి జిల్లాలో అనేక పాఠశాలల్లో జరుగుతోందన్నారు. బయట కూలి పనులకు వెళితే ఒక్కొక్కరికి రోజుకి రూ.600 చెల్లిస్తున్నారని, పాఠశాలల్లో వంట పని వారి ఇబ్బందులను మాత్రం ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు బియ్యం, గుడ్లను మాత్రమే ప్రభుత్వం సరఫరా చేస్తుందని, మిగిలిన వంట సామగ్రి కొనుగోలుకు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించే వరకు చేసిన అప్పులకు వడ్డీలు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనంతో పాటు యూనిఫారం, ఐడెంటిటీ కార్డు, ఆస్పత్రి సదుపాయం కల్పించాలని ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పి.మాణిక్యం, జి.లక్ష్మి, కె.రత్నకుమారి, పి.నాగమణి, గాజుల సత్యవతి, కె.పైడితల్లి, ఎ.నూకరత్నం, లక్ష్మి, పార్వతి పాల్గొన్నారు.

## పాఠశాలల్లో విద్యార్థుల్ని కలిసేందుకు ఆంక్షలా..

- పాఠశాలల్లో సమస్యలపై ప్రశ్నించరాదనే కూటమి ప్రభుత్వ కుయుక్తులు
- తక్షణమే జీవో నెం.30ను రద్దు చేయాలి
- వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌కుమార్



పెందుర్తి అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రతినిధులు

పెందుర్తి: కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాస్తూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల్లో విద్యా ప్రమాణాలను నీరుగార్చడమే లక్ష్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పనిచేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు బొడ్డపల్లి హేమంత్‌కుమార్ ఆరోపించారు. వసతి గృహాలు, పాఠశాలల్లో ఉన్న అనేక సమస్యలను తెలుసుకునేందుకు విద్యార్థులను కలవకుండా విద్యార్థి సంఘాలపై ఆంక్షలు విధించడం కూటమి ప్రభుత్వం భయంతో కూడిన చేతకాని తనం అని విమర్శించారు. ప్రభుత్వ వసతిగృహాలు, విద్యా సంస్థల్లోకి విద్యార్థి సంఘాలకు అనుమతి నిషేధిస్తూ ప్రభుత్వం జారీ చేసి జీవో నెం.30ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. పెందుర్తిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా హేమంత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగానికి బదులు ఎల్లో బుక్ ఎడ్యుకేషన్ పాలసీ నడుస్తుందని మండిపడ్డారు. పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల్లో సమస్యలపై విద్యార్థులను కలవనివ్వకుండా నిషేధించాలనుకోవడంలో కూటమి ప్రభుత్వంలో భయం కనిపిస్తోందని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా అమలు చేసిన నాడు–నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్ని, విద్యా ప్రమాణాలు మెరుగుపరిస్తే.. కూటమి ప్రభుత్వం ఆ ప్రమాణాలను పూర్తిగా నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. తక్షణమే జీవో 30 రద్దు చేయాలని.. లేకపోతే పోరాటం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జీవీఎంసీ 97వ వార్డు పార్టీ అధ్యక్షుడు మెంటి మహేష్, నియోజకవర్గ వలంటీర్ల విభాగం అధ్యక్షుడు అవగడ్డ శ్రీనివాస్, విద్యార్థి విభాగం మండలాల అధ్యక్షులు రాయ్‌రాజ్, గొలగాని మురళి, పీఎస్‌ఎస్‌ఆర్ పాత్రుడు, హేమంత్, మురళి, దాలిబోయిన మణికంఠ, మణి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి మోసాలను ప్రజల్లో ఎండగట్టాలి

**వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్**



అదీప్‌రాజ్‌ను శాలువాతో సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం కార్యవర్గ సభ్యులు

సబ్బవరం: వైఎస్సార్ సీపీ గ్రామ, మండల, జిల్లా స్థాయి యువజన విభాగం కమిటీలను త్వరితగతిన పూర్తి చేసి పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అన్నంరెడ్డి అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని అయ్యన్నపాలెంలో ఉత్తరాంధ్ర జిల్లా వైఎస్సార్ సీపీ, రాష్ట్ర కమిటీలో వివిధ పదవుల్లో కొనసాగుతున్న నాయకులతో ఆయన సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసపూరిత హామీలతో వంచించిందో చర్చించారు. వీటన్నింటినీ ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, కూటమి తీరును ఎండగట్టాలన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు మెంటాడ స్వరూప్, రేగం చాణక్య, ప్రధాన కార్యదర్శి పాలిశెట్టి సురేష్ రాజ్, దొడ్డి కిరణ్, సంయుక్త కార్యదర్శి మలసాల కుమార్‌రాజా, చింతకాయల వరుణ్, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఉరుకూటి చందు, పుల్లటి వెంకటేష్, అంబటి శైలేష్, అధికార ప్రతినిధి ఇమ్రాన్, పెదిశెట్టి శేఖర్, దిలీప్, బండారు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న పొక్లెయిన్, లారీల సీజ్



పోలీసులు సీజ్ చేసిన పొక్లెయిన్, రెండు లారీలు

సబ్బవరం: మండలంలోని పైడివాడ గ్రామంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతూ తరలిస్తున్న పొక్లెయిన్, రెండు లారీలు సీజ్ చేసినట్లు తహసీల్దార్ చిన్నికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడివాడ సర్వే నెం.164 కొండ పోరంబోకు భూమిలో సోమవారం అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు చేపడుతున్నట్లు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు ఆర్ఐ వీరయ్య, వీఆర్వో దేముడుబాబుతో కలిసి గ్రావెల్ తవ్వుతున్న పొక్లెయిన్, గ్రావెల్ తరలిస్తున్న రెండు లారీలను పట్టుకుని, సీజ్ చేసి, వాటిని పోలీస్‌లకు అప్పగించామన్నారు. పొక్లెయిన్ ఆపరేటర్ గుర్రాల రాజు(35), లారీ డ్రైవర్లు బొట్టా ముసలినాయుడు(55), బొట్టా సన్యాసిరావు(38)లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. తదుపరి చర్యలు నిమిత్తం మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.

## సాంకేతికతతో కొత్త ప్రయోగాలు

అగనంపూడి: సాంకేతిక రంగంలో వచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల వైద్య రంగంలో వినూత్న ప్రయోగాలు, పరిశోధనలు వస్తున్నాయని ఆర్‌ఐటీ గ్లోబల్ క్యాంపస్ (ఐరోపా) నిపుణుడు, ప్రొఫెసర్ దేబబ్రత సమంత్ అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం వర్చువల్ రియాల్టీ ఆధారిత ఆరోగ్య ప్రయోజనాలు, వినూత్న పరిశోధనల ఆయన మాట్లాడారు. వర్చువల్ రియాల్టీ టెక్నాలజీతో ఎటువంటి మార్పులకు అవకాశం, ఆస్కారం ఉందో వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

## నులి పురుగుల నివారణ అమలు తీరు పరిశీలన



పరవాడ పీహెచ్‌సీని సందర్శించిన రాష్ట్ర వైద్య బందం

పరవాడ: ఈ నెల 12 నుంచి అమలు చేయనున్న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా కార్యక్రమ అమలు తీరును పరిశీలించేందుకు వీలుగా రాష్ట్ర వైద్య బృందం డాక్టర్లు ఎస్.ఎస్.సౌందర్య, బి.సుజాతలు పరవాడ పీహెచ్‌సీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలికల జెడ్పీ హైస్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలను సోమవారం సందర్శించారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం అమలు తీరును యాజమాన్యాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో ఐఈసీ మెటీరియల్ ప్రదర్శనను వైద్య బందం పరిశీలించింది. ఏడాది నుంచి రెండేళ్ల వయసున్న పిల్లలకు సగం మాత్ర, మిగిలిన వయస్సు వారికి ఒక మాత్ర చొప్పున వేయాలన్నారు. ఆ రోజు మాత్ర వేసుకోనివారు మరుసటి రోజు వేసుకోవచ్చున్నారు. ఈ బృందం వెంట పరవాడ పీహెచ్‌సీ వైద్యులు హారిక, జయశ్రీ కరిష్మా, వైద్య సిబ్బంది జానకీరామన్, ప్రసాద్, పి.వి.రత్నం ఉన్నారు.

## మొల్లేటి గెడ్డలో ఫార్మా వ్యర్థాలతో ప్రజలకు ఇక్కట్లు



మొల్లేటి గెడ్డలో నిలిచిపోయిన రసాయన వ్యర్థ జలాలను చూపుతున్న గనిశెట్టి

పరవాడ: భర్నికం సమీపంలోని మొల్లేటి గెడ్డలో నిలిచిపోయిన ఫార్మా రసాయన వ్యర్థజలాలను వెంటనే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మొల్లేటి గెడ్డలో నిలిచిన రసాయన వ్యర్థ జలాలను ఆయన సోమవారం పరిశీలించారు. అనంతరం స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ మొల్లేటి గెడ్డలోకి ఫార్మా రసాయన వ్యర్థ జలాలను విడుదల చేస్తున్న ఫార్మా పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గెడ్డలో నిలిచిపోయిన వ్యర్థ జలాలను పరిశీలించిన పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు సంబంధిత యాజమాన్యాలకు నోటీసు లిచ్చి చేతులు దులిపేసుకున్నారే తప్ప, ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాల్లేవని ఆరోపించారు. రసాయన వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా వదిలిపెట్టడంతో భూగర్భ జలాలు కలుషితం కావడమే కాకుండా పర్యావరణం దెబ్బతింటుందన్నారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలపై పీసీబీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫార్మా పరిశ్రమల కాలుష్యంతో ఇబ్బంది పడుతున్న పరవాడ, భర్నికం, తానాం, తాడి, లంకెలపాలెం, సాలాపువానిపాలెం, ఈ బోనంగి గ్రామాల ప్రజలను ఆదుకోవాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

## నీరు ఇంకి.. సాగు మొదలై..



వర్షాభావ పరిస్థితుల కారణంగా మేహాద్రిగెడ్డ రిజర్వాయర్ దాదాపుగా అడుగంటింది. నీరు లేకపోవడంతో స్థానిక నిర్వాసిత రైతులు జలాశయ గర్భంలో మెరక భూమిని సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. వర్షాధారంగా ఆకు కూరల సాగుకు వీలుగా భూమిని చదును చేస్తున్నారు. సాధారణంగా ఏటా వర్షాకాలంలో నీటితో నిండి ఉండే ఈ ప్రాంతం ఎండా కాలంలో తోట పంటలు/ఆకుకూరల సాగు భూమిగా సమీప రైతులు వినియోగించుకోవడం పరిపాటి. అయితే ఈ ఏడాది వర్షాకాలంలో కూడా చెప్పుకోదగ్గ వానల్లేకపోవడంతో రైతులు ట్రాక్టర్లతో దుక్కులు చేసి స్వల్ప కాల పంటలకు సిద్ధమవుతున్నారు.

– పెందుర్తి

(ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం)

## జిల్లా స్థాయి యోగాలో జయలక్ష్మి ప్రతిభ



పండూరి జయలక్ష్మికి జ్ఞాపిక అందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ శంకర్

సబ్బవరం: విశాఖపట్నం జిల్లా యోగా సమాఖ్య ఆధ్వర్యంలో విశాఖలో నిర్వహించిన జిల్లా స్థాయి యోగా పోటీలలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి పండూరి జయలక్ష్మి ద్వితీయ స్థానంలో నిలిచింది. ప్రస్తుతం ఆమె కళాశాలలో ద్వితీయ సంవత్సరం బోటనీ మేజర్ చదువుతోంది. జయలక్ష్మి విజయం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ బి.శంకర్‌తోపాటు, అధ్యాపకులు ఎంపీ రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేష్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు



పెరేడ్‌లో పాల్గొన్న సీఐ సతీష్‌కుమార్, ప్రిన్సిపాల్ దీపిక

పెందుర్తి: విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక భాష్యం పాఠశాలలో ఇన్వెస్ట్యూర్ డేను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదలతోనే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చని పేర్కొన్నారు. వివిధ అంశాలపై విద్యార్థులకు అవగాహన కలిగించారు. పాఠశాల విద్యార్థులను పల్లవాస్, కాకతీయ, మౌర్య, శాతవాహన బృందాలుగా విభజించి పెరేడ్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవీ దీపిక, హెచ్‌ఎం టెస్సీ, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పెందుర్తి

9912222753

Office mail : sakshiadvtvsp@gmail.com